నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 21 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL

మావల పోలీస్‌స్టేషన్‌లో టీటీయూసీఐ నాయకులు

అర్ధరాత్రి ఆటో డైవర్ల అరెస్ట్

టీటీయూసీఐ నాయకుల ఆగ్రహం

ఎదులాపురం, డిసెంబర్ 20: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికై అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన టీయూసీఐ నాయకులు, ఆటో డ్రైవర్లను గురువారం అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేసి మావల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్‌లపై ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో (టీటీయూసీఐ) రాష్ట్ర కార్యదర్శి కే రాజన్న మాట్లాడారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు దళిత్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొంతమంది ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘాల నాయకులను గురువారం అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలతో పాటు ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయారని, ఈ సమస్యపై నిరసనలు తెలుపగా సంవత్సరానికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి మర్చిపోవడం దారుణమన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై ఈ నెల 7న సమ్మె పిలుపునిచ్చామన్నారు. సమ్మెను వాయిదా వేసి చర్చలకు రావాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలిచి ఇప్పుడు మాట్లాడేది లేదని దాట వేయడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే. షకీల్, నాయకులు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

దళారులు, మధ్యవర్తులకు దూరంగా ఉండాలి

- ఏజెన్సీ ప్రజలకు బ్యాంకు అధికారులే సేవలందించాలి
- టీజీబీ రాష్ట్ర చైర్మన్ శోభ, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఇంద్రవెల్లి, డిసెంబర్ 20 : దళారులు, మధ్యవర్తులను దూరంగా ఉంచుతూ గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలకు బ్యాంకు సేవలందించాలని అధికారులు, సిబ్బందికి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రాష్ట్ర చైర్మన్ శోభ, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను టీజీబీ రాష్ట్ర చైర్మన్ శోభ, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ప్రారంభించారు. బ్యాంకులోని లాకర్, క్యాషియర్, మేనేజర్ గదులను సందర్శించారు. ఈ సందర్భంగా వారిని బ్యాంక్ అధికారులతోపాటు గ్రామపెద్దలు సన్మానించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.25 కోట్ల చెక్కును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముత్నూర్‌లో ఏర్పాటు చేసిన నూతన బ్యాంక్ సేవలను ప్రజలతో పాటు బ్యాంక్ ఖాతాదారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యవర్తులతోపాటు దళారులను దూరంగా ఉంచుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. గతంలో రూ.1.60 లక్షలను ఉన్న క్రాప్ రుణాల పరిమితిని జనవరి నుంచి పెంచి రైతులకు వ్యవసాయ రుణాలుగా రూ.2లక్షల వరకు మంజూరు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పాడి పరిశ్రమతో ఆదాయం పొందాలన్నారు. మహిళలకు స్వయం ఉపాధి పథకం ద్వారా రూ.3 లక్షల నుంచి 6లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో అధిక శాతం సబ్సిడీపై అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, మాజీ జడ్పీటీసీ ఆర్కా పుష్పలత, రీజినల్ మేనేజర్ ప్రభుదాస్, ఎల్‌డీఎం ఉత్పల్‌కుమార్ ధామ్, బ్యాంక్ మేనేజర్ రమేశ్, రిటైర్డ్ మేనేజర్ ఆడే రామేశ్వర్, ఐకేపీ ఏపీఎం రామారావ్, ఆదివాసీ పెద్దలు సిడాం భీంరావ్, హెచ్‌కే జంగు పటేల్, మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, ఆర్కా ఖమ్ము, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీజీబీ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న బ్యాంకు రాష్ట్ర చైర్మన్ శోభ, కలెక్టర్ రాజర్షి షా

ఆశ్రమాల భవనాలకు మరమ్మతులు పూర్తి చేయాలి

ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, డిసెంబర్ 20 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల భవన మరమ్మతుల పనులు త్వరగా పూర్తిచేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆదేశించారు. శుక్రవారం ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో వంట గదులు, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. ఏజెన్సీలోని అంగన్‌వాడీ సెంటర్లు, సీసీ రోడ్లు, వంతెనల నిర్మాణాలను నెల వ్యవధిలో పూర్తిచేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జీల పనులను, గ్రామ పంచాయతీ భవనాలను, పాఠశాలలో ఆర్‌వో ప్లాంట్‌ల రిపేర్‌ను చేయించాలన్నారు. పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ నిరంజన్, డీఈలు శివ ప్రసాద్, సతీశ్, ఉమ్మడి జిల్లాల ఏఈలు శంకర్, ఉజ్వల్, రఘు, సుధాకర్, సాయికృష్ణ, ఇందల్, ప్రదీప్, బద్రుద్దీన్, ముకుంద్, సాయిలు ఉన్నారు.

అక్రమ కేసులపై ఆగ్రహం

కేటీఆర్‌పై ఆరోపణలపై దమ్ముంటే అసెంబ్లీలో చర్చించాలని బీఆర్ఎస్ శ్రేణుల డిమాండ్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా కేటీఆర్ ప్రపంచంలోనే గుర్తింపు పొందిన నాయకుడు అని, 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఎన్నో పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడంతో పాటు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించారని గుర్తు చేశారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించడాన్ని ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా కేసులు పెడుతున్నదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకపోవడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నదన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

- ఆదిలాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ)

రాష్ట్రంలో నియంత పాలన

కేటీఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడాన్ని మాజీ మంత్రి జోగు రామన్న తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియంత పాలన కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల అమలు, అదానీతో చీకటి ఒప్పందం, మూసి ప్రక్షాళన పేరిట ప్రజల సొమ్ము దుర్వినియోగం చేయడాన్ని బహిర్గతం చేసినందుకు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తూ అక్రమ కేసులు పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే ఆరోపణలపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. చర్చలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ ప్రకటించినా ప్రభుత్వం దొంగలా తప్పించుకోవడం అక్రమ కేసులనేదానికి నిదర్శనమన్నారు. కేటీఆర్‌పై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

- మాజీ మంత్రి జోగు రామన్న

అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకే కేటీఆర్‌పై కేసులు

కడెం/ఖానాపూర్ డిసెంబర్ 20: ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌తో ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర స్థాయిని పెంచిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో అవకతవకలు జరిగితే ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు ఎందుకు ముందుకు రావడం లేదని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ప్రభుత్వం ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నట్లు ఆయన మండిపడ్డారు. ఈ రకమైన కాంగ్రెస్ దుశ్చర్యలు బీఆర్ఎస్ పార్టీ నేతల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేవని, కేటీఆర్ అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకు పుడుతుందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ చేస్తున్న పోరాటాలకు భయపడి ఆయనపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చ పెడితే సమాధానం చెప్పేందుకు కేటీఆర్ సిద్ధంగా ఉన్నారని, ఈ విషయాన్ని ఆయన పదే పదే చెప్పినప్పటికీ ప్రభుత్వం ఆయనపై కావాలనే కేసులు పెడుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పిరికిపంద, దుర్మార్గ చర్యలకు పాల్పడుతున్నదన్నారు. కాంగ్రెస్ నాయకుల ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజా సమస్యలపై కేసీఆర్ సారథ్యంలో కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పోరాడుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గాలను ప్రజలు గమనిస్తున్నారని, ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. కేటీఆర్‌ను తట్టుకునే దమ్ములేకే ఇలాంటి ఆగడాలకు పాల్పడుతున్నారని, ఎన్ని కేసులు నమోదు చేసినా బీఆర్ఎస్, కేటీఆర్ ప్రజల పక్షాన ఉంటారని స్పష్టం చేశారు.

-ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్

రాజకీయ కక్షతోనే కేటీఆర్‌పై కేసు

భైంసా, డిసెంబర్, 20: రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి సర్కారు ఫార్ములా ఈ- కార్ రేసింగ్‌లో అవకతవకలంటూ అక్రమ కేసు నమోదు చేయించారని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డా. కిరణ్ కొమ్రేవార్ మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న కేటీఆర్‌ను చూసి రేవంత్ రెడ్డి భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో చర్చ పెడితే సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తున్నదని ప్రశ్నించారు. తక్షణమే అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్ రేసింగ్‌లో కేటీఆర్ అవకతవకలకు పాల్పడ్డారంటూ ప్రభుత్వం పెట్టిన కేసు అక్రమమన్నారు.

- బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డా. కిరణ్ కొమ్రేవార్

కేటీఆర్‌ను చూసి ఓర్వలేకనే కుట్రలు

ఇచ్చోడ, డిసెంబర్ 20 : ఫార్ములా ఈ- కార్ రేసింగ్‌తో తెలంగాణ ప్రతిష్టను పెంచిన కేటీఆర్‌ను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్ని తప్పుడు కేసులు పెడుతున్నదని ఇచ్చోడ మాజీ సర్పంచ్ పెంటన్న విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనను ఎత్తి చూపినందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ లక్ష్యంగా ఫోన్ ట్యాపింగ్, ఎన్ కన్వెన్షన్, జన్వాడ ఫామ్ హౌస్, లగచర్లపై వరుసగా ఆరోపణలు, తాజాగా ఫార్ములా ఈ-రేసు కేసులు పెడుతూ ప్రజల దృష్టి మరలిస్తున్నారని ఆరోపించారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చకు సవాలు విసిరిన కేసీఆర్‌కు సమాధానం చెప్పలేక తోక ముడిచిందన్నారు.

- ఓరగంటి పెంటన్న, మాజీ సర్పంచ్

రోడ్లు ఊడ్చి..నిరసన తెలిపి

రోడ్లు ఊడ్చి నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగ, ఉపాధ్యాయులు చేపట్టిన సమ్మెలో భాగంగా నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, రాజారత్నం, నరేశ్, తిరుపతి, నవిత, వీణ, అపర్ణ, పుష్పలత, రాధిక, శ్రీతల, గంగామణి, ప్రభ, సునీత తదితరులు పాల్గొన్నారు.

- నిర్మల్ అర్బన్, డిసెంబర్ 20

రోడ్డుపైనే భోజనం చేసి..

రోడ్డుపై భోజనం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 11 వ రోజుకు చేరుకున్నది. సమ్మెలో భాగంగా ఎన్టీఆర్ చౌక్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు రోడ్డుపై కూర్చొని భోజనం చేసి నిరసన తెలిపారు. ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రియాంక, దీప్తి, మల్లిక, నవీన, కవిత, పార్థసారథి, కేశవ్, వెంకటి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

- ఎదులాపురం, డిసెంబర్ 20

రెండో రోజూ ఏఎన్ఎంల ధర్నా

నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్ఎంలు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 20 : రాతపరీక్ష లేకుండా కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట గురువారం చేపట్టిన 48 గంటల ధర్నా కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగింది. గురువారం రాత్రి ఏఎన్ఎలు ధర్నా శిబిరంలోనే భోజనాలు చేసి నిద్రపోయారు. శుక్రవాం ఉదయం ధర్నా కొనసాగించారు. 20 ఏళ్ల నుంచి ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్నామని, తమను రెగ్యులర్ చేయాల్సిందిపోయి రాతపరీక్ష పెడుతామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సబబు కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా వైద్యాధికారి రాజేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. వీరికి పలు ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికారు.

పరీక్ష హాల్ టికెట్లను దహనం చేసిన ఏఎన్ఎంలు

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్ఎంలు

ఎదులాపురం, డిసెంబర్ 20 : ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట గురువారం కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు చేపట్టిన 48 గంటల ధర్నా శుక్రవారం కూడా కొనసాగించారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఏఎన్ఎంల రాత పరీక్ష హాల్ టికెట్‌లను దహనం చేసి నిరసన వ్యక్తం తెలిపారు. అనంతరం అక్కడే బైఠాయించి ధర్నా చేపట్టారు. పోలీసులు వచ్చి సముదాయించినా వినలేదు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు మాట్లాడుతూ కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం రాత పరీక్షా హాల్ టికెట్ లను విడుదల చేయడం దారుణమన్నారు. వెంటనే రాత పరీక్షను రద్దు చేసి కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కమిటీ కన్వీనర్ నవీన్ కుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణత అభియాన్‌పై వీడియోకాన్ఫరెన్స్

వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, డిసెంబర్20 : ఐటీఐ అయోగ్ సీఈవో ఆధ్వర్యంలో శుక్రవారం ఏడీపీ, ఏబీపీ (ఆకాంక్ష జిల్లాలు, ఆకాంక్ష బ్లాకులు ప్రోగ్రామ్)పై జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ రాజర్షి షా క్యాంప్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సమావేశంలో సంపూర్ణత అభియాన్‌లో అత్యుత్తమంగా ప్రదర్శించిన బ్లాకులు , జిల్లాలకు పురస్కారాలను ప్రోత్సహించడంపై చర్చించారు. ఇతర సూచికలను పూర్తి చేయడం, ప్రత్యేక ప్రాజెక్టులపై పని చేయడం, వాటిని తగినట్లుగా ప్రణాళికలో చేర్చడం వంటి అంశాలను ముందుకు తీసుకెళ్లడంపై పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నీతి అయోగ్ కో ఆర్డినేటర్ రాహుల్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

'అమిత్ షా' క్షమాపణ చెప్పాలి

దళిత, ప్రజా సంఘాల డిమాండ్ ● దిష్టిబొమ్మల దహనం

సారంగాపూర్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళితసంఘాల నాయకులు

పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను కించ పరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో నిరసనలు కొనసాగాయి. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ బస్టాండ్ ఎదుట, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బాసరలో, దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో సారంగాపూర్ మండల కేంద్రంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఖానాపూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ సంఘం నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. గాదిగూడ మండల కేంద్రంలోని కుమ్రం భీం చౌరస్తా వద్ద దళిత సంఘాల నాయకులు నిరసన తెలిపారు. నిర్మల్‌లో మినీ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

- నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 20